క్లుప్తంగా

మత్తు పదార్థాలు అమ్మితే చర్యలు



జాగిలంతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సోంపేట: మత్తు పదార్థాలు అమ్మితే చర్యలు తప్పవని సోంపేట ఎస్సై వి.లోవరాజు అన్నారు. పట్టణంలోని బస్టాండు ఆవరణలోని దుకాణాల్లో పోలీసు జాగిలాలతో శనివారం తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాలు విక్రయించేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తవ్వేసి వదిలేశారు..!



ఇళ్ల ముందు గోతులు తవ్వేసి వదిలేసిన దృశ్యం

టెక్కలి: చింతలగార గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు వేస్తామని చెప్పి వీధుల్లో గోతులు తవ్వేసి వదిలేశారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలల క్రితం పైపు లైన్‌ల కోసం గోతులు తవ్వేసి కాంట్రాక్టర్ వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకుంది. ఆ తరవాత పనులు నిలిపివేయడంతో గ్రామంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు పూర్తికాకపోవడం వలన ఒక వైపు మంచినీటి ఇబ్బందులతో పాటు మరో వైపు గోతులతో అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.



నందిగాంలో నీటి కోసం పాట్లు పడుతున్న రైతులు

కొనసాగుతున్న.. కష్టాలు!

- ఎరువుల కోసం పడిగాపులు
- సాగునీరు లేక రైతన్న విలవిల
- ఎండిపోతున్న నారుమడులు

టెక్కలి: రైతులకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో వరుణుడి కరుణ లేకపోవడంతో ఇప్పటికే వెదలు వేసుకున్న ప్రాంతాలతో పాటు దమ్ముతో సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నాయి. మరో వైపు కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీరు అందకపోవడంతో సాగునీటి కోసం రైతులు భగీరథుడికి మించి ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతానికి ఎత్తిపోతల పథకాల నుంచి నీటి సరఫరా నిలిపి వేయడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఒక వైపు ఎరువులు అందకపోవడం, మరో వైపు సాగునీరు లేక ఖరీఫ్ పంటలపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

టెక్కలి నియోజకవర్గంలో ఇలా..

టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 72,546 ఎకరాల్లో వరిసాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇందులో 56,500 ఎకరాలు మేజర్, మైనర్ సాగునీటి కాలువల ఆధారంగా పంట పొలాలు ఉన్నాయి. అలాగే వర్షాధారంపై 16,046 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతానికి అనుకూలంగా వర్షాలు లేకపోవడంతో వరి ఆకులు ఎండిపోతున్నాయి. మరో వైపు ఎత్తిపోతల పథకాల నుంచి నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో వరినారును కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లుపడుతున్నారు. అలాగే వెద పద్ధతిలో వేసిన పొలాలు వర్షం లేక ఎండిపోతుండడంతో అన్నదాతలో కలవరం ప్రారంభమైంది.



నీటి సరఫరా లేని కోటబొమ్మాళి మండలం చిన్నసాన ఎత్తిపోతల పథకం



టెక్కలి మండలం శివారు ప్రాంతాల్లో ఎండిపోతున్న పంట పొలాలు

సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం



పంటకు అవసరమైన సమయంలో నీరు అందడం లేదు. పంటను బతికించుకోవడానికి ఇంజన్లు పట్టుకుని నీరు ఉన్న ప్రాంతాలకు వెళ్తున్నాం. వరుణుడు కరుణించడం లేదు. పాలకులు పట్టించుకోవడం లేదు.

– జి.ఎర్రన్నరెడ్డి, రైతు, బూరగాం, టెక్కలి మండలం

నీరు సరఫరా ఆగిపోయింది



పంటలకు మంచి సమయంలో నీరు అందడం లేదు. ఎత్తిపోతల పథకాల నుంచి నీటి సరఫరా ఆగిపోయింది. ఒక్క చిన్నసాన ఎత్తిపోతల పథకం ద్వారానే 2200 ఎకరాలకు సాగు నీరు అందడం లేదు. మిగిలిన ప్రాంతాల్లో మరి దారుణమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాలువల్లో ఉన్న నీటిని పొలాలకు మళ్లించడానికి రైతులు పడరాని ఇబ్బందులు పడుతున్నారు.

– దుబ్బ వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యుడు, కోటబొమ్మాళి

సరైన ప్రణాళిక లేకే రైతులకు ఇబ్బందులు



పాలనా యంత్రాంగం సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరించడంతో రైతులకు విత్తనాలు మొదలుకొని ఇప్పుడు సాగునీటి వరకు అనేక కష్టాలు పడుతున్నారు. వ్యవసాయ శాఖా మంత్రి నియోజకవర్గంలోనే రైతులకు సాగు కష్టాలు రావడం దారుణం. నందిగాం మండలంలో కొండల ప్రాంతాలతో పాటు ఎత్తిపోతల పథకాలు ఉన్న చోట కూడా నీరు అందడం లేదు.

– ఎస్.శ్రీరామ్మూర్తి, ఎంపీపీ, నందిగాం మండలం

నిర్లక్ష్యానికి చెదలు..



అధికారుల నిర్లక్ష్యానికి సుమారు రూ. 2.30 లక్షల ప్రజా ధనం వృథా అయింది. ప్రకృతి విపత్తుల సమయంలో అదరాబాదరాగా నిధులు వెచ్చించి అనంతరం నిర్లక్ష్యంగా వదిలేసిన వైనం వజ్రపుకొత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద చోటుచేసుకుంది. 2012, సంవత్సరంలో ఏర్పడిన హుద్‌హుద్ తుపాను సమయంలో మండల కేంద్రానికి విద్యుత్ కోసం జనరేటర్లను కొనుగోలు చేశారు. ముచ్చటగా నెల రోజులు వినియోగించి అనంతరం వదిలేశారు. ప్రస్తుతం అవి పాముల పుట్టలు, చెదలతో నిండిన పొదల మధ్య తుప్పు పట్టి నిరుపయోగమయ్యాయి. అధికారులు దృష్టిసారించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. – వజ్రపుకొత్తూరు

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను శనివారం అందజేశారు. ఈ మేరకు 18 మందికి 23,44, 463 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, అధికారులు ఉన్నారు. – టెక్కలి

కదంబ పుష్పాలు కనువిందు



శ్రావణ మాసంలో కదంబ పుష్పాలు పూస్తూ కనువిందు చేస్తున్నాయి. గుండ్రంగా బంతి ఆకారంలో ఉండే ఈ పుష్పాలు సువాసనాలు వెదజల్లుతోంది. శ్రీకృష్ణుడు, లలితాదేవీ, పార్వతిదేవి స్వరూపంగా ఆరాధనలకు ఈ పుష్పాలు వినియోగిస్తారని అర్చకులు చెబుతున్నారు. ఉత్కళాంధ్రులు శ్రావణ మాసంలో ఈ పుష్పాలను పవిత్రంగా భావిస్తూ పూజల్లో ఉపయోగిస్తుంటారు. ఒడిశా ప్రాంతాల్లో ఈ వృక్షాలు అధికంగా ఉన్న ఈ వృక్షాలు ఇచ్ఛాపురం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో కనువిందు చేస్తోంది. జూలై, ఆగస్టు నెలల్లో మాత్రమే ఈ పుష్పాలు పూస్తుంటాయి. వీటిని రుద్రాక్షాంబ, వృత్త పుష్ప, కాదంబరీ, కర్ణపూరక, సింధుపుష్పం, మదాఢ్య, లాలనా పుష్పాలుగా పిలుస్తుంటారు. ఉత్కళాంధ్రులు ఈ చెట్టును కృష్ణవృక్షం, పార్వతీ వృక్షంగా పిలుస్తుంటారు. – ఇచ్ఛాపురం రూరల్



కదంబ పుష్పాలు

ఆత్మీయంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

రాఖీ పౌర్ణమి వేడుకలను సంప్రదాయబద్ధంగా శనివారం జరుపుకున్నారు. అన్నా, తమ్ముళ్ల క్షేమం కోరుతూ అక్కా, చెల్లెళ్లు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. దూరప్రాంతంలో ఉన్నవారు సైతం అన్నతమ్ముళ్లకు రాఖీ కట్టేందుకు వచ్చి అభిమానాన్ని చాటుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, స్వచ్ఛందసంస్థలు, కేజీబీవీల్లోని పిల్లలకు వివిధ సంస్థల ప్రతినిధులు రాఖీలు కట్టి సంప్రదాయాన్ని కొనసాగించారు. – సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు చీకటిబ్లాక్ బాహిపతిలోని గోపాలకృష్ణ సేవాశ్రమం అనాథాశ్రమంలోని చిన్నారులతో ఇచ్ఛాపురం రోటరీక్లబ్ సభ్యులు



పలాస: రామకృష్ణాపురంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో రక్షాబంధన్ సందడి



ఇచ్ఛాపురం రూరల్: భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో రాఖీపౌర్ణమి వేడుకలు



కవిటి: కొత్తపాలెం కేజీబీవీలో రక్షాబంధన్ వేడుకల్లో విద్యార్థినులు

'సీతాకోక చిలుక' పోస్టర్ విడుదల

పలాస: శైలర్ క్రియేషన్ బ్యానర్‌పై డాక్టర్ ఆర్.రాము స్వీయ రచన, దర్శకత్వంలో నిర్మితమైన సీతాకోక చిలుక ఫిల్మ్ పోస్టర్, ట్రైలర్‌ను కాశీబుగ్గ రామాలయం ఆవరణలో శనివారం ఉదయం ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సినీ హబ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే చిన్న నిర్మాతలకు సబ్సిడీలతో చిత్ర నిర్మాణం చేయుటకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు ఫిలిం ఫెడరేషన్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. శ్రీకాకుళం యాస, భాషను ఈ చిత్రంలో వాడుకలోకి తీసుకురావడం హర్షదాయకమన్నారు. సోషల్ వర్కర్ మురళీధొర మాట్లాడుతూ.. మన జిల్లాలో చలన చిత్ర నిర్మాణం జరిగేటప్పుడు దూర ప్రాంతాల నుంచి వచ్చిన చిత్ర మండలికి సంపూర్ణ సహకారం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో యాళ్ల సంతోష్, టి.మన్మథరావు, నటీ నటులు మద్దు జస్వంత్, డాక్టర్ కుమార్‌నాయక్, జోగా సంతోష్, భారతి,రజని, క్రాంతి, రమ్య, రక్షిత, సుంకర రాజు, ఎల్.రుద్ర పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నటీనటులు

బాలకృష్ణకు పరామర్శ



బాలకృష్ణను పరామర్శిస్తున్న నాయకులు

పలాస: సుమ్మాదేవి గ్రామానికి చెందిన పలాస నియోజవర్గం వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు దున్న బాలకృష్ణను పార్టీ నాయకులు శనివారం పరామర్శించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అంపోలు జైల్ నుంచి అతను విడుదలై ఇంటికి చేరుకున్నారు. ఆ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ, అగ్నికుల క్షత్రియ చారిటబుల్ అధ్యక్షుడు బొడ్డు చిన్నారావు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మాజీ సభ్యుడు బత్తిన లక్ష్మణ్, సరియాపల్లి సర్పంచ్ బత్తిన వెంకట్, బాహడపల్లి సర్పంచ్ బొడ్డు ఉమాపతి, నాయకుడు గొరకల షణ్ముఖరావు, ఎస్సీ సంఘం సభ్యుడు బెలమర జీవన్ తదితరులు బాలకృష్ణ ఇంటికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

యువజన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



యూత్ కాంగ్రెస్ జెండా ఆవిష్కరణలో నాయకులు

ఇచ్ఛాపురం: యువజన కాంగ్రెస్ పార్టీ 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలో నిర్వహించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

గోదాములను గాలికొదిలేశారు!

- వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- పట్టించుకోని కూటమి సర్కార్
- మార్కెట్ కమిటీ, ఏపీ పౌర సరఫరాల సంస్థ అధికారుల నిర్లక్ష్యం



బెండికొండ వద్ద ప్రారంభానికి నోచుకోని గోదాం



దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న మందస మండలం శ్రీరాంపురం వద్ద ఉన్న బహుళ ప్రయోజన గోదాం

వజ్రపుకొత్తూరు: రైతన్నలకు ఉపయోగపడాల్సిన గోదాములు దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అన్నదాత కోసమని గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన గోదాములు కూటమి సర్కార్ గాలికొదిలేయడంతో ఎందుకూ పనికి రాకుండా పోయాయి. పీఏసీఎస్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం, బియ్యం, పౌర సరఫరాలను నిల్వకు ప్రాధాన్యత ఇచ్చి నిర్మించారు. దీంతో సకాలంలో పౌర సరఫరాల పంపిణీతో పాటు రైతులు పండించిన పంటలను ఈ గోదాముల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అయితే వారి ఆశలపై కూటమి నేతలు నిర్లక్ష్యపు నీళ్లు చల్లి అందుబాటులోకి తీసుకురాకుండా కాలయాపన చేస్తున్నారు. పలాస నియోజకవర్గంలో మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఈ గోదాములు ప్రస్తుతం దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.



తుప్పుపట్టి నిరుపయోగంగా ఉన్న వేబ్రిడ్జి

వినియోగంలోకి తీసుకురావాలి

గోదాములను వినియోగంలోకి తీసుకువస్తే రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. ప్రస్తుతం గోదాముల్లేక జీడి, కొబ్బరి, వరి పంటలను నిల్వచేసే అవకాశం లేక దళారులకు అమ్ముకోవాల్సి వస్తుంది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన గోదాములను ప్రారంభించాలి.

– ఎస్.రామరావు, రైతు, మందస మండలం

తక్షణమే ప్రారంభించాలి



లక్షలాది రూపాయలు ఖర్చు చేసి రేషన్ సరుకుల నిల్వల కోసం గోదాం నిర్మించారు. అయితే నేటికీ ప్రారంభం కాలేదు. దీంతో మాకు రేషన్ సరుకులు సకాలంలో అందడం లేదు. నిర్మించిన వే బ్రిడ్జి కూడా తుప్పుపట్టింది. అధికారులు స్పందించి తక్షణమే ప్రారంభించాలి.

– ఐ.ఎండువాడు, కొండపూరు, వజ్రపుకొత్తూరు మండలం

పరిస్థితి ఇలా..

పలాస నియోజకవర్గంలోని మందస పీఏసీఎస్ ద్వారా శ్రీరాంపురం గ్రామంలో 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో డీసీసీబీ, నాబార్డు-ఎఐఎఫ్ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన గోదాం నిరుపయోగం కాగా నేటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అక్కడ రైతులు తమ ధాన్యం మద్దదు ధరకు విక్రయించేందుకు అవకాశం లేకుండా పోతుంది. దళారులు చెప్పిన ధరకే విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకుంది. ఇదికాక పీఏసీఎస్ ద్వారా పంపిణీ చేయాల్సిన ఇతర ఎరువులు, వేరుశనగ విత్తనాలు దాచుకునేందుకు సాధ్యం కావడం లేదు. దీంతో పీఏసీఎస్‌కు ఆదాయం సమకూరకపోగా రైతులకు ప్రయోజనమే లేకుండా పోయింది. ఇలా టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో సైతం వీటిని నిర్మించారు. వజ్రపుకొత్తూరు మండలంలోని బెండి కొండ వద్ద రూ.75 లక్షలతో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ నిర్మించిన గోదాం నిరుపయోగమైంది. ఇక్కడ నిర్మించిన వే బ్రిడ్జి సైతం తుప్పు పట్టింది. గోదాముకు చేపట్టిన ఎలక్ట్రికల్ వైరింగ్ దొంగల పాలవుతోంది. రెవెన్యూ, పౌరసరఫరాల సంస్థ ఇక్కడ బియ్యం, కందిపప్పు, నూనెలు, పంచదార ఇతర పౌర సరఫరాలను నిల్వ చేయాల్సి ఉంది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రజా ధనం వృథా అయింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిపోయినా నేటి వరకు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గోదాములను వినియోగంలోకి తీసురావాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



మాట్లాడుతున్న గిరిజన నాయకుడు సవర జగన్నాయుకులు

మందస: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మందసలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సంప్రదాయక నృత్య ప్రదర్శనతో గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆదివాసీ సంఘాలు, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, సంస్కృతి పరిరక్షణకు పాలకవర్గాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గిరిజనుల భూములకు రక్షణ లేకుండా పోయిందని, గిరిజన గ్రామాల్లో గిరిజనేతరుల ఆగడాలు ఎక్కువయ్యాయని అన్నారు. పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు గిరిజన ప్రాంతాలలో భూములను చట్ట విరుద్ధంగా సంపాదిస్తున్నారని, అటవీ భూములను ఆక్రమిస్తున్నారన్నారు. గిరిజనులు సాగు చేస్తూన్న భూములకు పట్టాలు ఇవ్వడం లేదని, గిరిజనులు దశాబ్దాల తరబడి సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వకుండా గిరిజనేతరులకు పట్టాలు మంజూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు తక్షణమే ప్రభుత్వ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మందస జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు సవర జగన్నాయకులు, సవర గణేష్, ఎం.డోంబురు, సవర జగన్, ఎం.దండాసీ, అబ్రహం, విజయ్, అప్పారావు, సోములయ్య, సీతారం, గున్నయ్య, కిరణ్‌కుమార్, సూర్యారావు, చిత్రసేను, జగన్నాథరావ్, బాలకృష్ణ, దుంబురు తదితరులు మాట్లాడారు.